# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :209 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 26-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## వేమూరి కావేరి ట్రావెల్స్ అక్రమాలు

హైదరాబాద్,కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో 19 మందిని విగత జీవులుగా చేసిన వేమూరి కావేరి ట్రావెల్స్ అక్రమ బాగోతం తేటతెల్లం అయ్యింది. ఆ సంస్థ నిర్వహించిన ఈ బస్సు సీటింగ్ క్యారీయరే కానీ స్లీపర్ సర్వీస్ కాదని తేలింది. వేమూరి కావేరి ట్రావెల్స్ పేరిట హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విశాఖపట్నం రూట్‌లలో టూరిస్టు పర్మిషన్లతో పర్యాటక ప్రాంతాలకు బస్సులను తిప్పే సంస్థగా నమోదైంది. తెలంగాణకు చెందిన హెబ్రాన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ బస్సును 2018లో కొనుగోలు చేసి 2023 వరకు నిర్వహించింది. ఆ తర్వాత వేమూరి వినోద్ కమార్ ఈ బస్సును కొనుగోలు చేసి తీసుకుని కేంద్ర పాలిత ప్రాంతమైన డయ్యూ డామన్‌లో తిరిగి రిజిస్ట్రేషన్ చేశారు. ఇక్కడే వేమూరి కావేరి సంస్థ అక్రమానికి తెరలేపింది. తెలుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేస్తే అధికారులు కొంత కఠినంగా ఉంటారన్న అంచనాతో డయ్యూ డామన్‌లో చేశారు. వాస్తవానికి ఈ సంస్థ ప్రధాన కార్యాయం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉంది. డయ్యూ డామన్‌లో ఆల్ ఇండియా పర్మిట్ తీసుకున్న కావేరి ట్రావెల్స్ .. ఒడిశాలోని రాయగడలో ఆల్టేషన్, ఫిట్‌నెస్ చేయించుకున్నారు.

## లిక్కర్ అమ్మకుండానే.. తెలంగాణ ఖజానకు కాసుల కిక్కు!



హైదరాబాద్,ఔను! నిజమే. ఎక్కడైనా లిక్కర్ విక్రయిస్తేనే సొమ్ములు వస్తాయి. కానీ, లిక్కర్ అమ్మకుండానే తెలంగాణ సర్కారుకు కాసుల మోత మోగింది. రెండేళ్లకు ఒకసారి వైన్స్ దుకాణాలకు ప్రభుత్వం లైసెన్సులు ఇస్తుంది. అదే బార్లయితే.. 3 సంవత్సరాలకు ఒకసారి ఇస్తారు. తాజాగా రేవంత్ రెడ్డి సర్కారు వైన్స్ దుకాణాలకు లైసెన్సులు ఇచ్చే కార్యక్రమానికి కొన్నాళ్ల కిందటే తెరదీసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2,620 వైన్స్ షాపులను ఏర్పాటు చేసుకునేందుకు ఇచ్చిన దరఖాస్తు గడువు.. ఈ నెల 24తో ముగిసింది. నిజానికి మరోసారి పెంచాలని అనుకున్నా.. మరోవైపు హైకోర్టులో కేసు ఉంది. దీంతో గడువును పెంచకుండా వచ్చింది చాలన్నట్టు ముగించారు.ఇక, 2,620 దుకాణాలకు గాను.. మొత్తం 95,137 మంది నుంచి దరఖాస్తులువచ్చాయి. ఒక్కొక్క షాపునకు సగటున 10-15 దరఖాస్తులు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక్కొక్క షాపునకు(డిమాండ్‌ను బట్టి) వేల సంఖ్యలో దరఖాస్తులు కూడా వచ్చాయి. వీటిని లాటరీ విధానంలో తీసి.. లైసెన్సీలను ఎంపిక చేస్తారు. ఇదిలావుంటే.. అసలు సర్కారుకు ఆదాయం ఇక్కడే వచ్చింది. ఒక్కొక్క దరఖాస్తుకు రుసుము కింద రూ.3 లక్షల ధరను నిర్ణయించారు. అంటే.. దరఖాస్తు చేసుకునే వారు రూ.3 లక్షలు చెల్లించాలి. అయితే.. ఈ సొమ్మును ప్రభుత్వం తిరిగి ఇవ్వదు. సదరు దరఖాస్తు దారుడికి షాపు దక్కినా.. దక్కక పోయినా.. ఈ సొమ్మును వదులు కోవాల్సిందే.ఈ లెక్కన 95,137 దరఖాస్తులకు రూ.3 లక్షల చొప్పున మొత్తం 2,854.11 కోట్ల రూపాయలు సర్కారు ఖజానాకు వచ్చి చేరాయి. ఈ సొమ్మును ప్రభుత్వం సంచిత నిధిలో ఉంచుతుంది. అంటే.. ఏ అవసరానికైనా దీనిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆర్థిక సమస్యల్లో ఉన్న సర్కారుకు ఇది అందివచ్చిన ఆదాయమనే చెప్పాలి. కాగా.. గతంలో కేసీఆర్ హయాంలో 2023లో లైసెన్సులు ఇచ్చారు. అప్పట్లో ఒక్కొక్క దరఖాస్తు 1.32 లక్షల రూపాయల చొప్పున ధర నిర్ణయించారు. కానీ, రేవంత్ రెడ్డి సర్కారు దీనిని ఏకంగా రూ.3 లక్షలకు పెంచింది. ఏపీలో అయితే.. రూ.10 లక్షల చొప్పున వసూలు చేసిన విషయం తెలిసిందే. ఇక, త్వరలోనే తెలంగాణ సర్కారు లాటరీ ద్వారా లైసెన్సులు ఇవ్వనుంది.

హైకోర్టులో కేసు!

మరోవైపు.. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న లిక్కర్ విధానంపై హైకోర్టులో పలు కేసులు దాఖలయ్యాయి. గతంలో రూ.1.32 లక్షలుగా ఉన్న దరఖాస్తు ఫీజును ఏకంగా రూ.3 లక్షలకు పెంచారని.. రెండు పిటిషన్లు పడ్డాయి. ఇది సరైన నిర్ణయం కాదన్నది పిటిషనర్ల వాదన. మరోవైపు.. ప్రభుత్వం తీసుకునే దరఖాస్తు ఫీజులను దుకాణాలు దక్కని వారికి తిరిగి ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ ఎక్కువ సంఖ్యలో పిటిషన్లు పడ్డాయి. అయితే.. వీటిపై విచారణ జరగాల్సి ఉంది. కానీ, ఇంతలోనే సర్కారు తాంబూలాలిచ్చేసినట్టు ప్రక్రియను ముగించేసింది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## బస్సు ప్రమాదంలో వెలుగులోకి మరో కీలక విషయం

హైదరాబాద్,బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద ఘోర ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. మాటలకందని ఈ విషాదంలో 19 మంది సజీవ దహనం అయ్యారు. ఈ ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. 20 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.బస్సు ప్రమాదానికి సంబంధించిన మరో కొత్త విషయం బయటకు వచ్చింది. బస్సు లగేజీ క్యాబిన్‌లో వందల సంఖ్యలో మొబైల్ ఫోన్లు ఉన్నట్లు గుర్తించారు.రూ.46 లక్షలు విలువైన దాదాపు 234 మొబైల్ ఫోన్లతో కూడిన పార్సిల్ ఉన్నట్లు గుర్తించారు. బస్సు ఢీ కొట్టగానే బైక్ పెట్రోల్ ట్యాంక్ మూత ఊడి అందులోని పెట్రోల్ మొత్తం రోడ్డుపై పడింది. బైక్‌ను బస్సు కొంతదూరం ఈడ్చుకెళ్లడంతో మంటలు చెలరేగాయి. ఆ అధిక వేడికి బస్సు లగేజ్ క్యాబిన్‌లో ఉన్న మొబైల్ ఫోన్ల బ్యాటరీలు ఒక్కసారిగా పేలాయి. దీంతో పెద్ద శబ్దం వచ్చింది.సాధారణంగా మొబైల్ ఫోన్ల పైభాగం ప్లాస్టిక్‌తో తయారు చేసినప్పటికీ.. బ్యాటరీలు మాత్రం లిథియంతో తయారు చేస్తారు. అవి అధిక వేడికి పేలుతాయి. కర్నూలు బస్సు ప్రమాదంలో అధిక వేడికి అవి పేలడం



వల్లే ప్రమాద తీవ్రత పెరిగి, భారీ ప్రాణ నష్టానికి దారితీసిందని ఫోరెన్సిక్ బృందాలు భావిస్తున్నాయి. ఆ మంటలు లగేజీ క్యాబిన్ నుంచి పై భాగంలోని ప్రయాణికుల కంపార్ట్‌మెంట్‌కు వ్యాపించాయని.. దీంతో వారు తప్పించుకునే ఛాన్స్ లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. కర్నూలు ప్రమాద ఘటనలో తీవ్రత పెరగడానికి మొబైల్ ఫోన్లే కారణమని ప్రాథమికంగా తేలింది.

## ఫలించిన హరీశ్ రావు కృషి..



హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కృషి ఫలించింది. బతుకు దెరువు కోసం జోర్డాన్ వెళ్లి చిక్కుకున్న 12 మంది వలస కార్మికులు ఎట్టకేలకు సొంతూళ్లకు చేరుకున్నారు. జోర్డాన్లో వారు పనిచేసే కంపెనీకి పెనాల్టీతో పాటు, రవాణ ఖర్చును భరించి బాధితులను తెలంగాణాకు రప్పించ్చారు. శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్పోర్టులో దిగిన బాధితులు, నేరుగా హరీశ్ రావు ఇంటికి వెళ్లి కలిశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఎన్ని సార్లు తమ సమస్య చెప్పుకున్నా పట్టించుకోలేదని బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. తమను తిరిగి భారత దేశానికి తీసుకొచ్చిన హరీశ్ రావుకు, బీఆర్ఎస్ పార్టీకి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపిన బాధితులు. ఈ సందర్భంగా హరీశ్ రావు.. వారి కుటుంబ పరిస్థితులు, జోర్డాన్‌లో ఎదుర్కొన్న ఇబ్బందులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని వారికి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోనే ఉండి ఉపాధి, ఉద్యోగ మార్గాలు ఆలోచించాలని సూచించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో జగిత్యాల, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లోని తమ తమ సొంతూళ్లకు చేరుకున్నారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ఆదేశాలతో జోర్డాన్ లో చిక్కుకున్న 12 మందిని స్వదేశానికి తిరిగి తీసుకువచ్చేందుకు కృషి చేశామన్నారు. బతుకు తెరువు కోసం, అప్పులు తీర్చడం కోసం జోర్డాన్, ఇజ్రాయిల్, గల్ఫ్ వంటి దేశాలకు వెళ్లి ఏజెంట్ల చేతుల్లో చిక్కుకొని ఎంతో మంది బతుకులు ఆగం అవుతున్నాయి. 12 మంది వలస కార్మికుల సమస్య తెలియగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాం. స్పందించి వారికి సాయం అందించాలని కోరాం. మరోవైపు జోర్డాన్ లోని ఇండియన్ ఎంబసీ ఆఫీస్ కు వెళ్లి కార్మికులు అనేక సార్లు మొరపెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసారు. అయినా స్పందన లేదు. అందుకే జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది కోసం పెనాల్టీ కట్టి తిరిగి స్వదేశానికి తీసుకువచ్చామని చెప్పారు.'ఇప్పటికైనా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఎంతోమంది ఉపాధి నిమిత్తం వివిధ దేశాల్లో అనేక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మన పిల్లల్ని మనం కాపాడుకోవడం ప్రభుత్వాల బాధ్యత. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దునిద్ర పోతే బీఆర్ఎస్ పార్టీ 12 మందినీ కాపాడి స్వదేశానికి తీసుకువచ్చింది. ఇవ్వాళ రేవంత్ రెడ్డి గల్ఫ్ సంక్షేమ బోర్డు పెడ్తా అని, వాళ్లకోసం ప్రత్యక పాలసీ తెస్తామని, నిధులు పెడతామని చెప్పారు. రెండేండ్లయినా రేవంత్ రెడ్డి నుంచి స్పందన లేదు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదు. మన రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్.. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్నటువంటి తెలంగాణ బిడ్డలను తీసుకురావడానికి ప్రత్యేకమైన ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. కానీ మీరు మరిచిపోతే ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ వీళ్లందరిని స్వదేశానికి తిరిగి తీసుకువచ్చింది. వలస కార్మికులకు బాసటగా నిలిచింది.' అని తెలిపారు.కాగా, జోర్డాన్ వలస కార్మికుల సమస్య తన దృష్టికి రాగానే దాదాపు రెండు వారాల నుంచి వారిని స్వదేశానికి రప్పించేందుకు హరీశ్ రావు ఎంతో కృషి చేశారు. ఒకవైపు జోర్డాన్ వలస కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా మీడియా దృష్టికి తీసుకువెళ్లిన హరీశ్, మరోవైపు బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి ద్వారా భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఇంకోవైపు సంబంధిత కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ క్రమంలో పెనాల్టీ చెల్లించి వారిని తెలంగాణకు తీసుకు వెళ్లేందుకు కంపెనీ ఒప్పుకున్నది. దీంతో వలస కార్మికుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా చెల్లించాల్సిన మొత్తంతో పాటు, స్వదేశానికి రావడానికి అయ్యే విమాన టికెట్లను సైతం స్వయంగా హరీశ్ రావు భరించారు. ఎట్టకేలకు హైదరాబాద్ చేరుకున్న వారిని ప్రత్యేక వాహనాల్లో సొంతుళ్లకు తరలించారు.

## ఢిల్లీలో తీవ్రస్థాయిలోనే వాయు కాలుష్యం..

న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతోంది. శనివారం ఉదయం కూడా గాలి నాణ్యత సూచీ పేలవమైన స్థాయిలో నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (Central Pollution Control Board) అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. శనివారం ఉదయం 8 గంటల సమయంలో రాజధాని ప్రాంతంలో ఓవరాల్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) 257గా నమోదైంది.అత్యధికంగా ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ స్థాయి 413గా నమోదైంది. వజీర్‌పూర్‌లో 342, షాదీపూర్‌లో 329, జహన్‌గిరిపురిలో 320, పంజాబీ బాగ్‌లో 296, బురారి ప్రాంతంలో 292, అలీపూర్‌లో 289, అశోక్ విహార్ ప్రాంతంలో 284, ఐటీవో 284, సోనియా విహార్‌లో 264, గురుగ్రామ్‌లోని సెక్టార్ 51లో 330, ఫరీదాబాద్‌లో 229, ఘజియాబాద్‌లోని ఇందిరాపురంలో 300, నోయిడాలో 307, మీటర్‌లో 263గా గాలి నాణ్యత సూచీ నమోదైంది.ఉదయం నుంచి నగరాన్ని దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో విజిబిలిటీ కూడా పడిపోయింది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యం తీవ్రమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గుండె, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్న వ్యక్తులు, వృద్ధులతోపాటూ చిన్నారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాయు కాలుష్యం కారణంగా ఛాతీలో అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, కండ్ల మంటలు వంటి వాటికి గురవుతారని హెచ్చరిస్తున్నారు. వాయు కాలుష్యం కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, AQI 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక AQI 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా



ఉందని, AQI 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, AQI 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

ఈ నెల 29న కృత్రిమ వర్షం

ఈ నెల 29న ఢిల్లీలో మొదటిసారిగా కృత్రిమ వర్షాన్ని కురిపించేందుకు ఏర్పాట్లు చేశామని సీఎం రేఖా గుప్తా వెల్లడించారు.బురాయ్‌లో ప్రయోగాత్మక పరీక్ష విజయవంతమైందన్నారు. ఐఐటీ-కాన్పూర్ సహకారంతో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు ఐఎండీ,ఐఐటీఎమ్-పుణె తోడ్పాటును అందిస్తున్నాయి. దీపావళి తర్వాత పొగ మంచు సీజన్‌లో కాలుష్య కణాలను తగ్గించడానికి వాయువ్య ఢిల్లీలో అయిదు చోట్ల ఈ కృత్రిమ వర్షం కురిపించనున్నారు. ఇందుకోసం డీజీసీపీ అనుమతి పొందారు.సిల్వర్ అయోడైడ్ లేదా సోడియం క్లోరైడ్ లాంటి పదార్థాలను మేఘాల్లోకి విడుదల చేయడం ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారు.

## ఐక్యరాజ్యసమితి పనితీరును తప్పుపట్టిన జైశంకర్

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి పనితీరును విదేశాంగ మంత్రి జైశంకర్‌తప్పుపట్టారు. యునైటెడ్ నేషన్స్‌పై తీవ్ర విమర్శలు చేసిన ఆయన.. ఆ సంస్థ గ్రిడ్‌లాక్ అయ్యిందన్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రాతినిధ్యం మరిచిపోయిందన్నారు. ఉగ్రవాదం, ప్రపంచ ప్రగతిపై నిర్ణయాలు తీసుకోవడం విఫలమైన ఆ సంస్థ తన విశ్వాసాన్ని కోల్పోయినట్లు పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన యూఎన్ 80వ సంబరాల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. ఐక్యరాజ్యసమితిలో బలమైన దేశంగా భారత్ ఉందన్నారు. కానీ ఆ ప్రపచం సంస్థ ప్రస్తుతం సంక్షోభంలో ఉందన్నారు. చట్టబద్ధమైన, ప్రభావంతమైన పనితీరును వ్యవహరించడం లేదని విమర్శించారు. ఐక్యరాజ్యసమితిలో అంతా సవ్యంగా లేదన్న విషయాన్ని గ్రహించాలని జైశంకర్ తెలిపారు. ఆ సంస్థ తీసుకుంటున్న నిర్ణయాలు.. సభ్య దేశాలకు నిదర్శనంగా లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్యలను కూడా ఆ సంస్థ పరిష్కరించడం లేదన్నారు. యూఎన్‌లో జరుగుతున్న చర్చలన్నీ ఏకపక్షంగా సాగుతున్నాయని, ఆ సంస్థ పని విధానం గ్రిడ్‌లాక్ అయ్యిందన్నారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలను నిలిపివేశారని, దానికి తోడు ఇప్పుడు ఆర్థిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయ న్నారు. యూఎన్ భద్రతా మండలిలో




మార్పులు చేయాలని, భారత్‌తో పాటు జపాన్, జర్మనీ, బ్రెజిల్ దేశాలకు పర్మనెంట్ సభ్యత్వాన్ని ఇవ్వాలని జైశంకర్ గుర్తు చేశారు. ఉగ్రవాద సంస్థలపైనా కానీ, ఆ దేశాలకు అండగా ఉన్న దేశాలపై చర్యలు తీసుకోవడంలో యూఎన్ విఫలమైందన్నారు. పెహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్‌పై ఆంక్షలు విధించకుండా చైనా అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు.

## ఒక్క చాన్స్ ప్లీజ్.. ఒకే ఒక్క చాన్స్!




పాట్నా:బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం వేడెక్కింది. నిన్న మొన్నటి వరకూ సీట్ల సర్దుబాటు కొలిక్కి రాక ప్రచారంలో వెనుకబడిన మహాఘట్ బంధన్ ఇప్పుడు ఆ వ్యవహారం తేలడంతో ప్రచారాన్నిస్పీడప్ చేసింది. ఈ సారి బీహార్ అసెంబ్లీ ఎన్నికలు మహాఘట్ బంధన్ కు చావో రేవోగా మారాయి. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత ప్రబలంగా ఉందన్న అంచనాలతో ఎలాగైనా ఈ సారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని మహాఘట్ బంధన్ సర్వశక్తులూ ఒడ్డుతోంది. కూటమిలోని ప్రధాన పార్టీలైన ఆర్జేడీ, కాంగ్రెస్ లు గెలుపు అంచనాలతో సీట్ల విషయంలో ఒకింత పట్టుదలకు పోయినా.. చివరాఖరకు ఒక అంగీకారానికి వచ్చాయి.ఈ వ్యవహారం వల్ల ప్రచారంలో కొంత విలువైన సమయాన్ని మహాఘట్ బంధన్ కోల్పోయిందనే చెప్పాలి. ఇప్పుడు దానికి కవర్ చేసుకోవడానికి ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ముఖ్యంగా మహాఘట్ బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్జేడీ అగ్రనేత తేజస్వీయాదవ్.. ప్రచారం చేస్తున్న తీరు ఆసక్తిగా ఉంది. అవినీతి రహిత పాలన అందిస్తామని చెప్పడమే కాకుండా.. అదేదో సినిమాలో హీరో వేషం ఒక్క చాన్స్ ప్లీజ్.. ఒకే ఒక్క చాన్స్ అంటూ తిరిగినట్లు.. తేజస్వీయాదవ్.. ఒక్క చాన్స్.. ఒకే ఒక్క చాన్స్ అంటూ ప్రజలను వేడుకుంటున్నారు. ఒక్క చాన్స్ ఇస్తే ప్రజా సమస్యలపై తక్షణం స్పందించే సర్కార్ ను ఏర్పాటు చేస్తానంటూ హామీ ఇస్తున్నారు. ఇక ప్రధాని మోడీ లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ లో కర్మాగారాలు ఏర్పాటు చేసి... బీహార్‌లో విజయం సాధించాలని చూస్తోందని విమర్శిస్తున్నారు. నితీష్ కుమార్ ప్రభుత్వం 55 కుంభకోణాలకు పాల్పడిందని ఆరోపించిన మోడీయే.. ఆయనపై చర్య తీసుకోకుండా ఆయన సర్కార్ కు మద్దతుగా నిలుస్తున్నారనీ, కుంభకోణాల సర్కార్ ను మళ్లీ గెలిపించమని కోరుతున్నారనీ ఆరోపిస్తున్నారు. గత ఆర్జేడీ హయాంలో నితీష్ సీఎం అన్న సంగతి తెలిసిందే. మోడీ అప్పుడు నితీష్ పై చేసిన విమర్శలను ప్రజలకు గుర్తు చేస్తూ ఓట్లు అడుగుతున్నారు. దేశంలో అత్యధిక నేర కార్యకలాపా లు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయని తేజస్వి ఆరోపిస్తున్నారు. తాను అర్థ సత్యాలు,అబద్ధాలు చెప్పననీ, చేసేదే చెబుతా, చెప్పిందే చేస్తా అని నొక్కి చెబుతున్నారు. ఇండియా కూటమి (మహాఘట్ బంధన్)ని గెలిపిస్తే.. తాను సీఎం అవుతాననీ, బీహార్ ను నేరరహిత రాష్ట్రం చేస్తాననీ చెబుతున్నారు. అలాగే రాష్ట్రానికి అవినీతి రహిత పాలన అందిస్తాననీ,ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని,కాంట్రాక్టు కార్మికులును రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇస్తున్నారు.

### మద్యం స్కామ్ కేసులో ఏడుగురికి షాక్

విజయవాడ,మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఏడుగురు నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు షాక్ ఇచ్చింది.వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సహా అందరి బెయిల్ పిటిషన్లనూ కొట్టివేసింది. న్యాయాధికారి పి.భాస్కరరావు శుక్రవారం ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీచేశారు. కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి,చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, బూనేటి చాణక్య, బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ బెయిల్

## బంగాళాఖాతంలో వాయుగుండం..! తెలంగాణలో మూడు రోజులు వానలు..!!



హైదరాబాద్ : తెలంగాణను మరోసారి వానలు ముంచెత్తుతున్నాయి. ఇప్పటికే కురుస్తున్న భారీ వర్షాలకు వరి పంటతో పాటు ఇతర పంటలు పూర్తి దెబ్బతిన్నాయి. రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో మరోసా రి తెలంగాణలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.ఆగ్నేయ బంగాళాఖాతంలో నిన్న ఉదయం ఏర్పడిన అల్పపీడనం రాగల 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఇవాళ వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.ఈ వాయుగుండం ఈనెల 26 నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.ఈనెల 27వ తేదీ ఉదయానికి నైరుతి బంగాళా ఖాతం దాని సమీపంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో తుఫానుగా బలపడే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్? వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో అక్కడకక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## సంపాదకీయం

ఆదివారం 26-10-2025

# ప్రజాస్వామ్యానికి నిజమైన కావలిదారు

ఎన్నికల రోజంటే చాలామందికి సెలవు దినం. కానీ, అది మన తలరాతల్ని మార్చుకునే రోజు అంటూ దాని విలువను పెంచిందో సంస్థ. మన చేతిలోని ఓటు వజ్రాయుధమన్న సంగతిని తెలుసుకునేలా చేసింది. మనల్ని ఓట్లు అడిగే నాయకులు తమ అర్హతలు, ఆస్తిపాస్తులు, నేర చరిత్ర వివరాలను తప్పనిసరిగా వెల్లడించేలా చేసిన ఆ సంస్థే 'ఏడీఆర్'. 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' అనే ఆ స్వచ్ఛంద సంస్థ వెనకున్న మహాశక్తి ప్రొఫెసర్ జగదీప్‌సింగ్ ఛోకర్. ఎన్నికల సంస్కరణల కోసం రెండున్నర దశాబ్దాలుగా పోరాడుతున్న జగదీప్ ఇటీవల కీర్తిశేషులయ్యారు.ప్రజాస్వామ్యానికి మూలస్తంభం ఓటరే. అలాంటి ఓటర్ల హక్కుల్ని కాపాడేందుకు ప్రొఫెసర్ జగదీప్ అవిశ్రాంతంగా శ్రమించారు. 'ప్రజల సీఈసీ'గా పేరొందారు. చండీగఢ్ సమీపంలోని ఖరార్ అనే చిన్న పట్టణంలో జన్మించిన జగదీప్ మెకానికల్ ఇంజినీరింగ్ చదివారు. భారతీయ రైల్వేలో సేవలు అందించారు. ఎంబీఏ చేశారు. లూసియానా స్టేట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఐఐఎం అహ్మదాబాద్‌లో సుదీర్ఘకాలంపాటు ప్రొఫెసర్‌గా పాఠాలు బోధించారు. చట్టాలపై అవగాహన పెంచుకునేందుకు న్యాయవిద్య కూడా చదివారు. ఎంతోమంది విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. మొదట్లో రాజకీయ అంశాలపై ఆసక్తేమీ లేకున్నా-ప్రజలు, వ్యవస్థలపై అవగాహన పెంచుకోవడం ప్రారంభించారు. ఐఐఎంలో సహోద్యోగి త్రిలోచన్‌శాస్త్రి సహవాసం జగదీప్ జీవితాన్ని మలుపు తిప్పింది. ప్రజాస్వామ్య పునాదులు బలహీనపడటంపై వారిమధ్య చర్చలు సాగేవి. అదొక మిషన్‌గా పరిణామం చెందింది. 1999లో ఇద్దరూ సహవ్యవస్థాపకులుగా ఏడీఆర్‌ను నెలకొల్పారు. భారత ఎన్నికల రాజకీయాల్లో సమూల మార్పులకు అక్కడే బీజం పడింది.

సంస్కరణల పథం

ఎన్నికల సంస్కరణ పోరులో భాగంగా అన్యాయం అనిపించిన నిర్ణయాలను జగదీప్ సవాలు చేశారు. ధైర్యంగా కోర్టు తలుపులు తట్టారు. ప్రజాస్వామ్య ప్రక్రియలన్నింట్లో ఓటరే కీలకంగా నిలవాలనే లక్ష్యంతో పనిచేశారు. ఓటర్ల హక్కుల కోసం జగదీప్ సాగించిన పోరాటాల్లో కొన్ని భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో మైలురాళ్లుగా నిలిచిపోయాయి. నేరపూరిత రాజకీయాలపై పిల్ దాఖలు చేయడం ద్వారా జగదీప్ ఈ సమరాంగణంలోకి అడుగుపెట్టారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాల్లో ఆస్తుల వివరాలు, నేర రికార్డులు, ఆర్థిక సమాచారం, విద్యార్హతలను వెల్లడించేలా చేశారు. రాజకీయ పార్టీలు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ) నిబంధనలను ఉల్లంఘిస్తుండటాన్ని బయటపెట్టారు. 2023లో రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన చరిత్రాత్మక తీర్పు ఏడీఆర్ సాధించిన ఘనవిజయం. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ నియమించాలని నాడు సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. శిక్ష పడిన ఎంపీలు, ఎమ్మెల్యేలను పదవుల నుంచి తప్పించే న్యాయ నిర్ణయం కూడా ఏడీఆర్ కీర్తికిరీటంలో మరో కలికితురాయి. ఏడీఆర్ దాఖలు చేసిన ప్రతి పిటిషన్ పౌరహక్కులకు జవసత్వాలు కల్పించేదే. ఏడీఆర్ కృషితోనే ఎన్నికల బాండ్లు రద్దయ్యాయి. బిహార్‌లో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను సవాలు చేస్తూ ప్రస్తుతం ఏడీఆర్ న్యాయపోరాటం సాగిస్తోంది. పరిశుద్ధ, బాధ్యతాయుతమైన ప్రజాస్వామ్యం కోసం ప్రొఫెసర్ జగదీప్ పోరాడారు. ఎన్నికల సంఘం ఎప్పుడు ప్రశ్నార్థకమైన నిర్ణయం తీసుకున్నా- పాత్రికేయులు, నేతలు, ఉద్యమకారులు, పౌరులు జగదీప్ ఎలా స్పందిస్తారోనని ఎదురు చూసేవారు. ప్రభుత్వ జవాబుదారీతనాన్ని పెంచేందుకు కృషిచేసే సంస్థలుగా పేరొందిన 'సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్', 'సిటిజెన్స్ విజిల్ బ్లోయర్స్ ఫోరమ్'లలోనూ ఆయన క్రియాశీలక సభ్యులుగా పనిచేశారు. ఎన్నికల నిధులు, ఓటర్ల జాబితా, వ్యయాలు, అభ్యర్థుల ఎంపిక వంటి ప్రక్రియలన్నీ మెరుగుపడేందుకు ఆయన సాగించిన కృషి భారత ప్రజాస్వామ్యంపై చాలా ప్రభావం చూపింది.

చేతల మనిషి...

ప్రతి ఎన్నికలకు ముందు ఎంపీ, ఎమ్మెల్యేల వివరాలు, కుటుంబ చరిత్రలు, ఆర్థిక సమాచారాన్ని ప్రజాబాహుళ్యంలో ఉంచేందుకు జగదీప్ పరిశ్రమించారు. ప్రజాస్వామ్యాన్ని ప్రేమించడమంటే మాటల్లో కాదని, చేతల్లో చూపాలనే నిష్ఠుర సత్యాన్ని మనకందించారు. న్యాయమైన, పారదర్శకమైన, పౌరకేంద్రిత ప్రజాస్వామ్యం కోసం గళమెత్తి కోట్ల మందిలో ప్రేరణ నింపారు. 'నిష్కళంక ఎన్నికలు, ఎన్నికల సంస్కరణల కోసం పోరాడిన క్రూసేడర్' అని మాజీ సీఈసీ ఎస్.వై. ఖురేషీ ప్రొఫెసర్ ఛోకర్ సేవల్ని కొనియాడారు. ఎనిమిది పదుల వయసులో జగదీప్ ఇటీవల గుండెపోటుతో మరణించారు.

# డేటా సెంటర్ల ధగధగ.. డిజిటల్ వెలుగుల వెనుక 'శాశ్వత' విషపు పొగలు!




ఉద్యోగాల జాతర! లక్షల కోట్ల పెట్టుబడులు! అభివృద్ధి పరుగులు! కృత్రిమ మేధ విప్లవంతో ప్రపంచాన్ని శాసించే సత్తా! విశాఖ తీరంలో కొలువుదీరనున్న డేటా సెంటర్లపై ప్రభుత్వాలు, టెక్ దిగ్గజాలు మనకు అందిస్తున్న చిత్రం ఇది. డేటాను ఆధునిక ఇంధనంగా అభివర్ణిస్తూ, ఈ సెంటర్లను నవతరం రిఫైనరీలుగా కీర్తిస్తున్నారు. ఇదంతా నాణేనికి ఒకవైపే. మరి రెండో వైపు కంటికి కనిపించని, తరతరాలను వెంటాడే ఒక పెనుభూతం పొంచి ఉందన్న సంగతి మీకు తెలుసా? అభివృద్ధి రంగులద్దిన ఈ చిత్రంలో, 'శాశ్వత రసాయనాల' రూపంలో దాగి ఉన్న ఆ చీకటి కోణం ఏమిటి%ా%? ఈ ఆందోళన ఎందుకు అవసరం%ా? డేటాసెంటర్లు.. ప్రస్తుతం ఏ నోట విన్నా ఇదేమాట వినిపిస్తోంది. డేటా అనేది ఆధునిక ఇంధనమైతే డేటాసెంటర్లే సరికొత్త రిఫైనరీలని కూడా చాలామంది చెబుతున్నారు. రాబోయే రోజుల్లో విపరీతంగా డబ్బులు సంపాదించిపెట్టే ఈ డేటాసెంటర్ల ఏర్పాటుకోసం కొన్ని లక్షల కోట్లు వెచ్చించడానికి కూడా టెక్ దిగ్గజాలు వెనకాడటం లేదు. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ లాంటి సాంకేతిక దిగ్గజాలకు వారి సెర్వర్, నెట్‌వర్కింగ్ పరికరాలకు.. ప్రపంచం మొత్తమ్మీద ఉన్న డిజిటల్ ట్రాఫిక్ నిర్వహణకు డేటా సెంటర్లు చాలా అవసరం. దానికితోడు ఇప్పుడు ప్రపంచం మొత్తాన్ని ఊపేస్తున్న ఏఐ, ఎంఎల్ విప్లవం కూడా డేటా సెంటర్ల అవసరాన్ని బాగా పెంచుతోంది. అయితే.. లక్షల కోట్ల పెట్టుబడులతో వీటిని ఎక్కడ ఏర్పాటుచేస్తున్నారు.. మన దేశంలోనే! అది కూడా అక్కడా ఇక్కడ కాదు.. తాజాగా గూగుల్ సంస్థ అమెరికా వెలుపల తమ అత్యధిక పెట్టుబడిగా చెబుతున్న డేటాసెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటుచేయడానికి అన్నీ సిద్ధం చేసుకుంది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1.88 లక్షల ఉద్యోగాలు వస్తాయని కూడా భారీగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇవన్నీ నాణేనికి ఒకవైపయితే, రెండోవైపు వీటివల్ల వచ్చే నెగెటివ్ ప్రభావాలు ఏంటన్నది చూడాలి. అమెరికాలో వీటివల్ల విద్యుత్ డిమాండ్ ఉన్నట్టుండి అనేక రెట్లు పెరిగిపోయింది. పోనీ ఇవేమైనా స్వచ్ఛ ఇంధనం వాడుకుంటాయా అంటే.. ఆయా మార్గాల్లో ఏడాది మొత్తం ఒకేలా విద్యుత్ ఉత్పత్తి సాధ్యం కాదన్న విషయం అందరికీ తెలిసిందే. గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమైసనదాంట్లో 80% వరకు సౌర విద్యుత్తు లాంటివాటినే వాడుకుంటామని చెబుతున్నారు. కానీ విశాఖ అసలే సముద్రతీర ప్రాంతం. తుపానులు వచ్చే అవకాశం ఎక్కువ. మబ్బుపట్టి, వర్షాలు కురిసే సమయంలో విద్యుత్ ఉత్పత్తి ఎంత వస్తుంది? అది రాకపోతే సంప్రదాయ విద్యుత్తు పెద్దమొత్తంలో కావాల్సిందే కదా? అంతేకాదు.. వీటికి పెద్దమొత్తంలో నీరు కూడా అవసరం అవుతుంది. ఇవన్నీ ఒక ఎత్తయితే ఫరెవర్ కెమికల్ పొల్యూషన్.. అంటే శాశ్వత రసాయన కాలుష్యంగా చెప్పే పీఎఫ్ఏ అనేది మరో ఎత్తు. పీఎఫ్ఏ గ్యాస్ లేదా ఎఫ్-గ్యాస్‌ను వీటిలో తప్పనిసరిగా వాడాల్సి వస్తుంది. ఇది గ్రీన్ హౌస్ వాయువు అవుతుంది. దీనివాడకం వల్ల ఇంతకుముందు డేటాసెంటర్ల వల్ల వస్తుందని భావిస్తున్న కాలుష్యం కంటే చాలా దారుణంగా వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ ఎఫ్-గ్యాస్‌లు చాలా శరవేగంగా ప్రపంచం మొత్తాన్ని చుట్టేస్తున్నాయి. మరోవైపు డేటాసెంటర్ల వల్ల వచ్చే వాయు, గాలి కాలుష్యంపై ఇంతవరకు పరిశోధనలు, పరీక్షలు ఏమీ జరగలేదు. ఈ కంపెనీలు తాము వాడే రసాయనాలు ఏవేంటి, విడుదల చేసే వాయువులు ఏంటన్న విషయాన్ని కూడా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ.. ఇలా చెప్పడాన్ని తప్పనిసరి చేసేలా చట్టాలను మార్చాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. డేటాసెంటర్లు ఉపయోగించే పీఎఫ్ఏ, ఇతర రసాయనాలపై వేగంగా సమీక్షిస్తామని ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ప్రకటించిన తర్వాతి నుంచి ఈ డిమాండ్లు పెరిగాయి. తాము వాడే పీఎఫ్ఏల వల్ల పెద్దగా కాలుష్యం ఉండబోదని డేటాసెంటర్ పరిశ్రమలు చెబుతున్నా.. పర్యావరణవేత్తలు మాత్రం కాదంటున్నారు. "డేటాసెంటర్లలో పీఎఫ్ఏలు వాడతారని మాకు తెలుసు. అలా వాడినదంతా ఎక్కడో ఒకచోటుకు వెళ్లాల్సిందే. కానీ ఇంత ప్రమాదకరమైన విషయం గురించి ఇప్పటివరకు ఎక్కడా పెద్దగా పరిశీలన, పరిశోధన జరగడం లేదు. డేటాసెంటర్ల నిర్మాణం జరుగుతున్న వేగంతో పోలిస్తే పరిశోధనల వేగం చాలా తక్కువగా ఉంది" అని ఎర్త్ జస్టిస్ అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రముఖ న్యాయవాది జొనాథన్ చెబుతున్నారు. ఈ సంస్థ డేటాసెంటర్లలో పీఎఫ్ఏల వాడకాన్ని పరిశీలిస్తోంది. తమ సంస్థల్లో వాడే పరికరాలు నీళ్ల వల్ల పాడవ్వకుండా, మరకలు పడకుండా, గ్రీజు మకిలి అంటకుండా ఉండేందుకు పీఎఫ్ఏలను ఉపయోగిస్తారు. ఇందులో 16వేల రసాయనాలు ఉంటాయి. వీటివల్ల క్యాన్సర్, పుట్టుకతో లోపాలు, రోగనిరోధక శక్తి తగ్గడం, కొలెస్టరాల్ పెరగడం, కిడ్నీ వ్యాధులు.. ఇలా అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. పీఎఫ్ఏ అనేది పర్యావరణంలో సహజంగా కలిసిపోదు కాబట్టి దీన్ని శాశ్వత రసాయనం అంటారు. డేటాసెంటర్ల వల్ల పీఎఫ్ఏ కాలుష్యం ప్రత్యక్షంగా, పరోక్షంగా పెరుగుతుంది. ప్రధానంగా వాటిలో ఉపయోగించే కూలింగ్ పరికరాల్లో దీన్ని వాడతారు. దీనివల్ల అక్కడే కాలుష్యం చాలా ఏర్పడుతుంది. దాంతోపాటు పరికరాల్లో వాడే పీఎఫ్ఏలను తప్పక ఎక్కడో ఒకచోట పారేయాలి. ఎందుకంటే, వీటిలో రసాయనాలను పూర్తిగా నాశనం చేయలేం. డేటాసెంటర్లలో వాడే సెమీకండక్టర్ల ఉత్పత్తిలో కూడా చాలా పెద్దమొత్తంలో పీఎఫ్ఏ వాడతారు. దాంతో సెమీకండక్టర్ల ఉత్పత్తి ప్లాంట్ల వద్ద కూడా కాలుష్యం పెరుగుతుంది.

ఆందోళనలను కొట్టిపారేసిన సీఎం చంద్రబాబు : ప్రపంచ ఏఐ రాజధానిగా విశాఖను చేయాలనుకుంటున్న ప్రస్తుత తరుణంలో ఈ కాలుష్యం గురించిన చర్చ లేశమాత్రంగానైనా కనిపించడం లేదు. అమెరికా, చైనాలతో పోటీపడుతూ విశాఖను ఏఐ రాజధానిగా చేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రపంచం మొత్తానికి అవసరాలను ఇక్కడి నుంచే తీరుస్తామని, దీనివల్ల రాష్ట్రానికి బోలెడంత సంపద సమకూరడంతో పాటు ఉద్యోగావకాశాలు ఇబ్బడిముబ్బడిగా ఉంటాయని ఆయన అంచనా వేస్తున్నారు. విద్యుత్, నీటి అవసరాల గురించి కొందరు ప్రశ్నించినా, వాళ్లు తమకు కావల్సిన విద్యుత్తు అవసరాల్లో 80% వరకు వాళ్లే సౌర విద్యుత్తు ఉత్పత్తితో తీర్చుకుంటారని, అందువల్ల దాని గురించి ఆలోచించాల్సిన అవసరమే లేదని ఆయన చెబుతున్నారు. ఆధునిక కూలింగ్ వ్యవస్థల్లో నీటి అవసరం లేదంటూ ఆ విషయాన్ని కూడా కొట్టిపారేశారు. అయితే, అప్పటికి ఎవరికీ పెద్దగా ఈ డేటాసెంటర్లలో వాడే పీఎఫ్ఏల గురించి తెలియకపోవడంతో దాని గురించి ఆయన్ను ఎవరూ అడగలేకపోయారు. చల్లబరచాలంటే ఎఫ్-గ్యాస్ ఉండాల్సిందే : సాధారణంగా సెమీకండక్టర్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వేడెక్కకుండా

# బంగారం ధరలను నిర్ణయించేదెవరు ?

న్యూఢిల్లీ,బంగారం ధరలను ఎవరు నిర్ణయిస్తారు..ఇది అతి పెద్ద ప్రశ్న. సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు ఉన్న భేతాళ ప్రశ్న. పెట్టుబడులు పెడుతూ పోతుంటే..అమ్మకాలు పెరిగితే ధరలు తగ్గాలి. కానీ తగ్గడం లేదు. ఇటీవల ఒక్కరోజులో 9వేలు తగ్గిందని తెగ ప్రచారం చేశారు. కానీ ఎంత పెరిగితే 9 వేలు తగ్గిందో చెబితే బాగుండేది. నిజానికి ఇప్పటికే సామాన్యులు వన్ గ్రామ్ గోల్డ్‌పై మోజు పెంచుకున్నారు. గిల్టు నగలకు ప్రాధన్యం పెరిగింది. బంగారంతో పోలిస్తే దీనిని అట్టే గుర్తించలేం. ప్రపంచ వ్యాప్తంగా బంగారం నిల్వలు, పెరుగుదలపై అన్నీ భేతాళ కథలే వినిపిస్తున్నాయి. నిజానికి బంగారం మీద మోజు తగ్గించుకుంటే జీవితాలు బగుపడతాయి. బంగారంపై పెట్టే పెట్టుబడులు ఇతరత్రా రంగాలపై పెడితే మంచిది. బంగారం ధరలు పెరగడం వల్ల మనిషి ప్రాణ్యాలకు విలువ లేకుండా పోతోంది. తులం బంగారం మెడలో వేసుకుని వెళ్లినా పుటుక్కున చంపేసి లాక్కెళ్లుతున్నారు. ఇటీవల వరుసగా జరిగిన ఘటనలు చూస్తుంటే బంగారం ధరలు పెరగడంతో దొంగలు ప్రాణాలు తీయడానికి కూడా వెనకాడడం లేదు. బంగారం, వెండి ఏది ఉన్నా ప్రాణాలమీదకు రావడం ఖాయం. బంగారం, వెండి ధరలు ఇలా అనూహ్యంగా పెరుగుతూ పోతుంటే సామాన్యులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టక తప్పడం లేదు. బంగారానికి వన్ గ్రామ్ గోల్డ్ ఆర్నమెంట్లు వచ్చినట్లే ..వెండిలో జర్మన్ సిల్వర్ అందుబాటులోకి వచ్చింది. ఇది కూడా ఎవరు గుర్తించలేరు. అచ్చు వెండిలాగే ఉంటుంది. ఇప్పుడు పెళ్లిళ్లు పేరంటాల్లో జర్మన్ సిల్వర్ తళుక్కుమంటోంది. ఫోటో గ్రఫీ కోసం వన్ గ్రామ్ గోల్డ్ నగలు మెరిసి పోతున్నాయి. ప్రజలు తమవల్ల కానప్పుడు వ్యామోహం తగ్గించుకుంటా రనడానికి ఈ రెండు లోహాల వాడకాన్ని గుర్తించవచ్చు. అయితే భారతదేశంలో బంగారం ధరలు గతంలో ఎప్పుడూ లేనంతగా మరొకసారి చరిత్ర సృష్టిస్తున్నాయి. ఆగస్టు నుండి బంగారం ధరలు ప్రతివారం మూడు నుండి నాలుగుసార్లు కొత్త రికార్డులు సృష్టిస్తూ, ఆకాశాన్నంటుతున్నాయి. వరుసగా ధరల పెరుగు దలతో బంగారం ధరలు ఆల్‌టైమ్ హైని తాకాయి. అంతర్జాతీయంగా పెరుగుతున్న జియోపాలిటికల్ ఉద్రిక్తతలు, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ప్రభావం, అలాగే అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ పెట్టుబడి దారుల నమ్మకంపై దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం, వెండి ధరల కదలికలపై అందరి చూపు పడింది. భారతదేశంలో బంగారం ధరల నిరంతర పెరుగుదల అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గోల్డ్ రేట్ల పెరుగుదలతో సమాంతరంగా కొనసాగుతోంది. పెట్టుబడిదారులు భద్రతా ద్రవ్యంగా బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీపావళి వారంలో రికార్డు స్థాయిలను తాకిన తర్వాత, అక్టోబర్ 24న భారతదేశంలో బంగారం మరియు వెండి ధరలు కొంత తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లలో లాభాల బుకింగ్,డాలర్ బలపడటం వల్ల ధరల్లో స్వల్ప సవరణ కనిపించింది. బంగారం మరియు వెండి ధరలు పరిశీలిస్తే తాజాగా 24 క్యారెట్ బంగారం గ్రాముకు 12,507, 22 క్యారెట్ బంగారం గ్రాముకు 11,464, 18 క్యారెట్ బంగారం గ్రాముకు 9,380 గా ఉంది. వెండి కిలో ధర 1.59 లక్షలుగా నమోదైంది. దీపావళి ర్యాలీ తర్వాత ఇది మార్కెట్ సాధారణ సవరణగా పరిగణించబడుతోంది. మొత్తంగా బంగారం ధరల పెరుగుదల ఇప్పుడు కొందరికి ఆనందంగానూ ఉంది. తరతరాలుగా ఇంట్లో మూలుగుతున్న బంగారం ఉన్న వాళ్లకు ఇదో ఆస్తిగా నిలుస్తోంది. తులం బంగారంపై బ్యాంకులు కూడా 70 నుంచి 80 వేల వరకు రుణాలను ఇస్తున్నాయి. సామాన్యులకు దూరమవుతున్న బంగారం సంపన్నులకు



చేరువవుతోందని చెప్పలేం. ఇప్పుడు కనీవినీ ఎరుగని రీతిలో పసిడి ధరలు రికార్డుల్ని తిరగ రాస్తోంది. దేశీయ మార్కెట్లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు,పండగ, పెళ్లిళ్ల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తాంది. బుధవారం నాడు హైదరాబాద్లో రూ.1.30 లక్షలు దాటింది. మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3వేలు ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం మీద పెట్టే పెట్టుబడులకు మంచి భద్రత ఉందన్న మాట ఎవరూ కాదనలేరు. అలాగని బంగారం పెరుగుతుందో పెరగదో, ఒక వేళ తగ్గుతుందా, ఎలాంటి పరిస్థితుల్లో తగ్గుతుంది, ఎప్పుడు జాగ్రత్త పడాలి, ఎలా జాగ్రత్త పడాలన్న అంశాలపై పూర్తి అంచనా, విశ్లేషణలు అవసరం. ఎందుకంటే ఒక్కోసారి మనం కొన్న ధరలు అలాగే ఉంటాయని అనుకోవడానికి లేదు. ఏ క్షణమైనా ధమాల్ మని అనవచ్చు. అప్పుడే బంగారం లాంటి నిర్ణయాలు తీసుకోవచ్చు. వీటిపై ఎవరూ ఏమీ చెప్పలేకపోతున్నారు. బంగారం ధర పెరుగుతుందనో, తగ్గుతుందనో ఊహించడమంటే అదొక లాటరీగానే భావించాలి. మార్కెట్ విశ్లేషకుల అంచనా కూడా ఇదే. కొందరైతే సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని విశ్లేషణలు గమనిస్తే కిలో బంగారం ఖరీదు బాగా తగ్గుతుందంటున్నారు. కనుక అంతవరకు ఆగితేమంచిదని విశ్లేషిస్తున్నారు. ఒకవేళ తగ్గితే ఆడవారికి ఊరటే. మరో పక్కన ఆకాశం పైకెగురుతున్న ధర నేలచూపులు చూసే అవకాశమే ఉందని, అంతర్జాతీయ స్థాయిలో మార్పులు వస్తే తగ్గడం ఖాయమంటున్నారు. ప్రధానంగా దుబాయ్ వంటి అరబ్ దేశాలలో, భారతదేశంలో మహిళలు బంగారాన్ని ఆభరణాలుగా చేయించుకుని ధరించేందుకు మోజు పడ తారు. అలా బంగారాన్ని దాచుకున్న వాళ్ళకి ఇప్పుడు అనూహ్యంగా ధనం వచ్చి చేరినట్లే. ఎందుకంటే కాస్త బంగారం ఉన్నా ప్రత్యామ్నాయ పెట్టుబడులకు ఉపయోగపడుతున్నాయి. వాటిపై బ్యాంకు రుణాలిస్తున్నాయి. మానవారి అవసరాలు తీరుతున్నాయి. ఏదైనా వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టాలన్నా వారిని బంగారమే నిలబడుతోంది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్ చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబ డులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమం లోనే గోల్డ్ వెండికి గిరాకీ విపరీతంగా ఉంటోందని విశ్లేషణలు వస్తున్నాయి. భౌతిక రాజకీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల కారణంతో ఈ ఏడాది ఇంతవరకు బంగారం ధర 67 శాతం పెరిగింది. మార్కెట్ అనిశ్చితులు ఇలాగే ఉంటే బంగారం మోజు తగ్గించుకోవడమే శ్రేయస్కరం. ఒకప్పుడు షేర్ మార్కెట్ మీద ఇలాంటి అంచనాలతో జనం పెట్టుబడిపెట్టేవారు. అలా పెట్టుబడి పెట్టి మోసపోయిన వారూ ఉన్నారు. కాబట్టి ఈ పెరుగుదలతో ఆనందపడరాదు. మోసపోరాదు.

# భారత సంతతి వ్యక్తిపై మూన్‌లైటింగ్ ఆరోపణలు

వాషింగ్టన్,భారత సంతతికి చెందిన మెహుల్ గోస్వామి అనే వ్యక్తి అమెరికాలో అరెస్టయ్యాడు. మూన్‌లైటింగ్ చేయడమే అతడి అరెస్టుకు కారణం. ఒక వ్యక్తి సాధారణ ఉద్యోగ సమయం తర్వాత కూడా మరో ఉద్యోగం చేయడాన్ని మూన్‌లైటింగ్ అంటారు. న్యూయార్క్ వాసి అయిన గోస్వామి న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. ఇది అతడి ప్రాథమిక ఉద్యోగం. ఈ సమయంలో అతడు మాల్టాలోని గ్లోబల్‌ఫౌండ్రీస్ సెమీకండక్టర్ కంపెనీలో కాంట్రాక్టర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్నాడు. 2022 నుంచి అతడు ఇందులో కాంట్రాక్టర్‌గా ఉన్నాడు. ఇ మెయిల్‌ల ఆధారంగా గోస్వామి మూన్‌లైటింగ్‌కు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. రాష్ట్ర నిధుల్లోంచి దాదాపు రూ.44 లక్షలు దొంగతనం కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాల్సిన సమయంలోనే.. ప్రైవేటు కంపెనీ కోసం పనిచేస్తుండటంతో అక్టోబరు 15న అధికారులు అతడిని అరెస్టు చేశారు. 'నిజాయతీగా సేవ చేసేందుకే ప్రభుత్వ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగిస్తారు. గోస్వామి దాన్ని తీవ్రంగా ఉల్లంఘించాడు. రాష్ట్రం కోసం పనిచేస్తున్నా అని చెప్పుకుంటూ.. మరో కంపెనీ కోసం పూర్తి సమయం కేటాయించాడు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో సహా ప్రజా వనరులను దుర్వినియోగం చేయడమే' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ లూసీ లాంగ్ పేర్కొన్నారు. ఇటీవల అధికారులు గోస్వామిని కోర్టులో హాజరుపరచగా.. అతడు బెయిల్ లేకుండానే విడుదలయ్యాడు. అయితే, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతుంది. ఇందులో నేరం రుజువైతే అతడికి 15 ఏళ్లు జైలు శిక్ష పడుతుంది. ఇక, గోస్వామి అరెస్టు నేపథ్యంలో మూన్‌లైటింగ్ గురించి మరోసారి చర్చ జరుగుతుంది.

# ఐక్యరాజ్య సమితి పనితీరు అందుకు తగ్గట్లుగా లేదు

న్యూఢిల్లీ,ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్తుందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించలేవని వ్యాఖ్యానించారు. ఈక్రమంలో యూఎన్‌లో అంతా సరిగా లేదన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది అత్యవసరమైనప్పటికీ.. యూఎన్‌లో మార్పులు జరిగేలా ఆ సంస్కరణలు ఉండాలన్నారు. ఐరాసకు భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని.. అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ.. యూఎన్ నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. ఐరాస 80వ వార్షికోత్సవం నేపథ్యంలో పోస్టల్ స్టాంపు విడుదల చేసిన సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడారు. వివాదాల యుగంలో శాంతి అనేది అవసరమని జై శంకర్ పేర్కొన్నారు. ఇటీవల మైనారిటీల రక్షణకు, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులు కాపాడేందుకు భారత్ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలంటూ ఐరాస మానవ హక్కుల కమిషన్ ప్రస్తుత ఛైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. దీనికి భారత్ దీటుగా బదులిచ్చింది. ఆ దేశం జాత్యహంకారం, క్రమబద్ధమైన వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావించింది. ముందు వాటిని పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాలని సూచించింది. మరోవైపు.. పహల్గాంలో పౌరులపై జరిగిన ఉగ్రదాడిని ప్రపంచవ్యాప్తంగా ఖండించినప్పటికీ.. పాకిస్థాన్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. యూఎన్ సమావేశాల్లో పదేపదే కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు భారత్‌పై నిందలు మోపే ప్రయత్నాలు చేస్తుంది. అయితే, భారత్ వీటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతుంది. ఈ పరిణామాల నేపథ్యంలో జై శంకర్ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇక, గురువారం యూఎన్‌లో జరిగిన సమావేశాల్లో పాక్ దౌత్యవేత్తలు ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అయితే, భారత్ వీటిని తీవ్రంగా వ్యతిరేకించింది.

# ఆలయ భూమికి ఎసరు!

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లో అత్యంత ప్రాచీనమైన అనంత పద్మనాభస్వామి దేవాలయ చెరువు ఉన్నది. ఆ కోనేరును అనంత పద్మనాభస్వామి కుంటగా పిలుస్తారు. సర్వే నంబర్ 365లోని 6.02 ఎకరాల్లో విస్తరించిన ఈ కుంటను కబ్జా చేసేందుకు కొంతకాలంగా కొందరు ప్రయత్నిస్తున్నారు. గతంలో దేవాలయ భూమిని అక్రమంగా అమ్మిన అర్చకులే ఆ కుంటను తమకు అమ్మారని చెప్తున్నారు. ఆ స్థలాన్ని తాము తీసుకుంటామంటూ కోర్టును ఆశ్రయించారు. దాదాపు రూ.300 కోట్ల విలువైన ఆ కుంట కబ్జాకు గురికాకుండా నిరోధించి, దేవాలయ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపి కోర్టులో కేసు బెంచిపైకి రాకుండా అడ్డుపడుతున్నారు. మరోవైపు చెరువుల పరిరక్షణే తమ ధ్యేయమని చెప్తున్న హైడ్రాకు ఈ విషయం తెలిసినా పెద్దగా పట్టించుకోవడం లేదు.

కబ్జాదారులకు అధికార పార్టీ ముఖ్యనేత సహకారం

నీటిపారుదల శాఖ నిర్వహించిన సర్వేలో అనంత పద్మనాభస్వామి కుంట 6.049 ఎకరాల్లో విస్తరించి ఉన్నట్టు నార్త్ ట్యాంక్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధ్రువీకరించడంతోపాటు సంబంధిత మ్యాప్‌ను కూడా రూపొందించారు. మరోవైపు అత్తాపూర్ గ్రామపటంలో కూడా 365 సర్వే నంబర్‌లో చెరువు ఉన్నట్టు చూపిస్తున్నదని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. దేవాదాయ శాఖ సైతం ఆ భూమి తమదేనని ప్రకటించింది. అయినప్పటికీ కొందరు కబ్జాదారులు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ముఖ్యనేత సహకారంతో ఆ చెరువును మాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అనంత పద్మనాభస్వామి ఆలయ భూములను కొట్టేయాలని ఎప్పటినుంచో కన్నేసిన ఆ నేత.. ఇప్పుడు కబ్జాదారులకు సహకరిస్తూ దేవాదాయ శాఖపై ఒత్తిడి పెంచుతున్నట్టు సమాచారం. ఆ చెరువును ఆనుకుని ఆర్డీవో ఆఫీసు ఉన్నది. దీంతో తొలుత ఆ చెరువు ముందు వైపున కనీసం రెండెకరాలైనా కొట్టేయాలని దీనిపై కేసు వేసిన ఇరువర్గాలు ఓ ఒప్పందానికి వచ్చినట్టు తెలుస్తున్నది. ఆ రెండెకరాల స్థలం రూ.50-60 కోట్లకుపైగా ధర పలుకుతుందని, అది అత్తాపూర్ దగ్గర నుంచి వెళ్లే ప్రధానరహదారికి కలుస్తుందని స్థానికులు తెలిపారు.

కౌంటర్ వేయని దేవాదాయ శాఖ

అనంత పద్మనాభస్వామి కుంటను గతంలో మట్టిపోసి మూసేశారు. అనంతరం ఆ చెరువు పూడికతీత, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. కానీ, ఆ చెరువును చెరబట్టడంలో భాగంగా అర్చకుడి నుంచి భూమి కొనుగోలు చేశామంటూ కొందరు కోర్టును ఆశ్రయించి స్టేటస్‌కో ఉత్తర్వులు తెచ్చారు. దీంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మరోవైపు అది చెరువేనని హైకోర్టుకు ఇరిగేషన్ శాఖ స్పష్టత ఇచ్చినప్పటికీ దేవాదాయ శాఖ మాత్రం ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయలేదు. దీని వెనుక మర్మమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీ నేత బెదిరింపులతోపాటు కబ్జాదారుల నుంచి కొంత లావాదేవీలు జరగడం వల్లనే దేవాదాయ శాఖ కౌంటర్ వేయలేదని

# చంద్రబాబుకు మేలు.. జగన్ తీరు!



అమరావతి,ప్రతిపక్ష హోదా లేకపోయినా ఆంధ్రప్రదేశ్ లో అధికార కూటమికి ప్రత్యర్థి పార్టీ వైసీపీ మాత్రమే. ఇది ఎవరూ కాదనలేని వాస్తవం. అంతే కాకుండా గత ఏడాది జరిగిన ఎన్నికలలో ఘోర పరాజయం తరువాత.. మళ్లీ రాష్ట్రంలో రాజకీయంగా బలోపేతం కావాలని ప్రయత్నిస్తున్న పార్టీ. అటువంటి పార్టీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం, లోపాలను ఎత్తిచూపడాన్ని ఎవరూ తప్పుపట్టరు. కానీ కువిమర్శలు, అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టడానికీ, తప్పుదోవపట్టించడానికి చేస్తున్న ప్రయత్నాలు వైసీపీకి మేలు చేయవు సరికదా, ఆ పార్టీ ప్రతిష్ఠను మరింత మసకబారుస్తాయి.ప్రత్యర్థి పార్టీగా వైసీపీ ప్రస్తుతం చేస్తున్న విమర్శలు, ఆరోపణల వల్ల రాజకీయంగా ఆ పార్టీకి మరింత నష్టం చేకూరుస్తున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో వైసీపీ అధినేత, ఆ పార్టీ నేతలూ వ్యవహరిస్తున్న తీరు.. అధికార కూటమికి, తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు ఎనలేని మేలు చేస్తున్నాయని వివరిస్తున్నారు. తాజాగా వైసీపీ అధినేత జగన్ సీఎం చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు బూమరాంగ్ అయ్యాయి. జగన్ విమర్శల వల్ల ఆయనకు రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా నష్టం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఇంతకీ జగన్ ఏమన్నారంటే.. చంద్రబాబు ఎవరికీ క్రెడిట్ ఇవ్వరనీ, ఎవరో చేసిన మంచి పనుల క్రెడిట్ ను కూడా తన ఖాతాలో వేసేసుకుని, అంతా తానే చేశాన్న బిల్డప్ ఇచ్చుకుంటారనీ జగన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ చెప్పారు.ఆయన వ్యాఖ్యలకు నెటిజనులు క్షణం ఆలస్యం చేయకుండా గట్టి కౌంటర్ ఇస్తున్నారు. కియా, విశాఖకు ఏఐ వంటి అంశాలలో తొలుత విమర్శలకు దిగిన జగన్ తీరా వాటికి ప్రజల నుంచి వచ్చిన అమోఘమైన సానుకూలతను గమనించి అవి తమ ఘనత వల్లే వచ్చాయని క్లెయిమ్ చేసుకోవడానికి చేసిన ప్రయత్నాన్ని నెటిజనులు ప్రస్తావిస్తూ జగన్ ను ట్రోల్ చేస్తున్నారు. అనంతపురానికి కియా రాక తన తండ్రి వైఎస్ దేననీ, అదానీతో తాను గతంలో జరిపిన చర్చల వల్లే విశాఖకు గూగుల్ డేటా సెంటర్, ఏఐ వచ్చాయనీ జగన్ చెప్పుకోవడాన్ని గుర్తు చేస్తూ.. చంద్రబాబు ఎన్నడూ వేరొకరి క్రెడిట్ ను తన ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నించలేదని గుర్తు చేస్తున్నారు. ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడిగా ఆయన అప్పుడూ, ఇప్పుడూ కూడా దివంగత ప్రధాని పీవీ నరసింహారావు పేరునే ప్రస్తావించడాన్ని గుర్తు చేస్తున్నారు. ఇక వైఎస్ జగన్ తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకువచ్చిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి వాటిని చంద్రబాబు కొనసాగించారనీ, అయితే ఆ క్రెడిట్ ను తన ఖాతాలో వేసుకోవడానికి ఎన్నడూ ప్రయత్నించలేదనీ గుర్తు చేస్తున్నారు నెటిజనులు. ఇక హైదరబాద్ కు అదనంగా సైబరాబాద్ ఆవిర్భావం చంద్రబాబు ఘనతే అనడంలో సందేహం లేదు. ఎందుకంటే.. జగన్ స్నేహితుడు, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ స్వయంగా పలు సందర్భాలలో హైదరాబాద్ లో ఐటీ అభివృద్ధి చంద్రబాబు వల్లే సాధ్యమైందని చెప్పారు. నెటిజనులు అదే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. జగన్ అసత్యాలను ప్రచారం చేస్తూ చంద్రబాబును వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల రాజకీయ మైలేజ్ రావడం సంగతి అటుంచి ఉన్న ప్రతిష్ఠ కూడా మసకబారుతుందని విశ్లేషకులు అంటున్నారు.

# బీసీ రిజర్వేషన్లు.. కోల్డ్ స్టోరేజీలోకేనా?

హైదరాబాద్,తెలంగాణలో ఇటీవలి కాలంలో రాజకీయంగా ఎంత చర్చనీయాంశమైందో.. అంతకు మించి వివాదాస్పదమైన బీసీ రిజర్వేషన్ల అంశం ఇక కోల్డ్ స్టోరేజీలోకి వెళ్లిపోయినట్లేనా? తెలంగాణ స్థానిక ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రేవంత్ సర్కార్.. ఆ విషయంలో చేతులెత్తేసిందా? ఈ విషయంలో కోర్టు తీర్పు ప్రతికూలంగా వచ్చే అవకాశాలున్నాయని తెలిసినా తగ్గేదే లే అంటూ ముందుకు వెళ్లిన రేవంత్ సర్కార్ చివరికి ఇది జరిగేది లే.. అని ఉసూరు మందా అంటే పరిశీలకులు ఔననే అంటున్నారు. సుప్రీం కోర్టులో కూడా చుక్కెదురైన తరువాత కూడా రేవంత్ సర్కార్ బీసీ రిజర్వేషన్ల అంశంలో ముందుకే సాగుతామని సంకేతాలిచ్చింది. ఈ విషయంపై గురువారం (అక్టోబర్ 23)న జరిగిన కేబినెట్ సమావేశంలో చర్చించి కీలక నిర్ణయం తీసుకుంటామన్న సంకేతాలిచ్చింది.అయితే గురువారం (అక్టోబర్ 23) సుదీర్ఘంగా జరిగిన కేబినెట్ భేటీలో ఈ అంశంపై కనీసం చర్చ కూడా లేకపోవడంతో రేవంత్ సర్కార్ రిజర్వేషన్ల అంశాన్ని కోల్డ్ స్టోరేజీలో పెట్టేసినట్లేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది. అంటే కాంగ్రెస్ దింపుడు కళ్లెం ఆశ కూడా వదిలేసుకుని.. రిజర్వేషన్ల ఊసెత్తకుండానే 'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం అవుతోందని అవగతమౌతోంది.ఎందుకంటే రిజర్వేషన్ల అంశం చర్చించకుండా.. స్థానిక ఎన్నికలలో పోటీకి ఇంత కాలం



ఉన్న ఇద్దరు పిల్లలు అన్న నిబంధనను రద్దుపై చర్చించి, ఆమోదం తెలిపింది. ఇందు కోసం పంచాయతీరాజ్ చట్టంలో మార్పు చేయడానికి కేబినెట్ తీర్మానించింది. దీంతో స్థానికి ఎన్నికలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తుతానికి అటకెక్కించేసినట్లేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# స్లీపర్ బస్సుల్లో ప్రమాదాలు ఎక్కువే

హైదరాబాద్, కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న బస్సు దుర్ఘటన అనేక కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో శుక్రవారం తెల్లవారుజామున మంటలు చెలరేగి పలువురు సజీవ దహనమైన సంగతి తెలిసిందే. సరిగ్గా 10 రోజుల క్రితం రాజస్థాన్‌లోనూ ఇదేతరహా ప్రమాదం జరిగి 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇవే కాదు.. గత కొన్నేళ్లుగా స్లీపర్ బస్సుల్లో జరుగుతోన్న ప్రమాద ఘటనలు ప్రయాణికుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. వీటి నిర్వహణకు కఠిన నిబంధనలు తీసుకురావాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో 30 నుంచి 36 బెర్త్‌లు ఉంటాయి. అదే మల్టీ యాక్సిల్ బస్సులైతే 36-40 మంది ప్రయాణించవచ్చు. ఒక్కో బెర్త్ ఆరు అడుగుల పొడవు.. 2.6 అడుగుల వెడల్పులో ఉంటుంది. అయితే బెర్త్‌లను అనుసంధానించే గ్యాలరీతోనే ఇక్కడ సమస్య. ఈ గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉండటంతో ఒకసారి ఒక వ్యక్తి మాత్రమే వెళ్లడానికి వీలుంటుంది. ప్రమాదాల సమయంలో ప్రయాణికులు ఈ ఇరుకైన ప్రాంతం నుంచి వేగంగా బయటకు రాలేకపోతున్నారు. స్లీపర్ బస్సుల్లో ప్రయాణం సౌకర్యవంతంగానే ఉంటున్నా.. సీట్ల మధ్యలో పరిమిత స్థలం వల్ల ప్రయాణికుల కదలికలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువమంది లోపల చిక్కుకుపోతున్నారని అభిప్రాయపడుతున్నారు. ఇక, స్లీపర్ బస్సుల ఎత్తు కూడా మరో సమస్యగా మారుతోంది. సాధారణంగా వీటి ఎత్తు 8-9 అడుగుల వరకు ఉంటోంది. ఒకవేళ బస్సు ఉన్నట్టుండి ఒక వైపునకు ఒరిగిపోయినప్పుడు.. ప్రయాణికులు కిటికీలను లేదా ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లను చేరడం కష్టంగా మారుతోంది. ఈ ఎత్తు వల్ల రెస్క్యూ ఆపరేషన్‌కు కూడా ఆటంకం కలుగుతోంది. బస్సు ఎక్కి ప్రయాణికులను బయటకు తీసేలోపు మృతుల సంఖ్య పెరుగుతోందని నిపుణులు భావిస్తున్నారు. 300 నుంచి 1000 కిలోమీటర్ల దూరం ఉండే ప్రయాణాలకు స్లీపర్ బస్సులను అధికంగా వినియోగిస్తున్నారు. సాధారణంగా ఈ బస్సులు రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తాయి. దీంతో డ్రైవర్‌కు అలసట లేదా మగత వచ్చే ముప్పు కూడా ఎక్కువగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. అధునాతన బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటు



చేస్తున్నా.. వాటి పనితీరు, సామర్థ్యంపై ఇంకా అనుమానాలు ఉన్నాయి. డ్రైవింగ్ సమయంలో తాము నిద్ర మత్తులో ఉంటున్నామని 25శాతం మంది డ్రైవర్లు అంగీకరించినట్లు 2018లో నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. అర్ధరాత్రి తర్వాత నుంచి ఉదయం 6 గంటల్లోపు డ్రైవర్లు నిద్రలోకి జారుకునే అవకాశం ఉందని పలు అధ్యయనాలు పేర్కొన్నాయి. ప్రమాదాల సమయంలో మొదటి రెండు నిమిషాల్లో ప్రతిస్పందించే తీరే అత్యంత కీలకమని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రలోనే ఉంటారు. సీట్లలో మెలకువగా ఉన్నవారు లేదా ప్రమాదం జరిగిన వెంటనే తేరుకున్న వారు ప్రాణాలతో బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక, అప్పర్ బెర్త్‌ల్లో ఉన్నవారు బయటపడటం చాలా క్లిష్టంగా ఉంటోందని అంటున్నారు.ఈ స్లీపర్ బస్సులు తొలుత పశ్చిమదేశాల్లో నడిపేవారు. సిటీల మధ్య వినోద ప్రయాణాల కోసం వీటిని వినియోగించేవారు. ఆ తర్వాత సాధారణ ప్రజా రవాణాలో ఇవి భాగమయ్యాయి. అయితే, వీటిల్లో జరుగుతోన్న ప్రమాదాల కారణంగా కొన్ని దేశాలు స్లీపర్ బస్సుల వినియోగాన్ని తగ్గించుకుంటున్నాయి. చైనాలో 2009 తర్వాత నుంచి 13 స్లీపర్ బస్సు ప్రమాదాలు జరిగి 252 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో 2012లో వీటి రిజిస్ట్రేషన్లను చైనా నిలిపివేసింది.

# నేరాల రేటులో ముందున్న డబుల్ ఇంజన్ సర్కార్లు



పాట్నా, నేరాల రేటులో భాజపా పాలిత రాష్ట్రాలే ముందువరుసలో ఉన్నాయని, అక్కడ వారు ఏం చేస్తున్నారని తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. మహాగఠ్‌బంధన్ ఈ నిరుపయోగమైన డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కూలదోస్తుందన్నారు. ఒక ఇంజిన్ అవినీతిమయమైందని, మరో ఇంజిన్ నేరపూరితమైందని దుయ్యబట్టారు. బిహార్‌లో ఆర్జేడీ 'జంగల్ రాజ్' పై మరో వందేళ్లయినా చర్చ జరుగుతూనే ఉంటుందని ప్రధాని నరేంద్రమోదీ విమర్శించిన సంగతి తెలిసిందే. దానిపై తాజాగా మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ స్పందించారు. తమ కూటమి అధికారంలోకి వస్తే.. అవినీతి రహిత పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు బిహార్ రాజధాని పట్నాలో మాట్లాడారు. నీతీశ్ కుమార్ ప్రభుత్వం పాల్పడిన 55 కుంభకోణాల గురించి ప్రధాని మోదీనే వెల్లడించారు. ఆ అవినీతిపై ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారు..? మోసాలు జరుగుతున్నప్పుడు, ఎలాంటి చర్యలు లేనప్పుడు దానిని జంగల్ రాజ్ అంటారని ఎత్తి పొడిచారు. ఆర్జేడీ తేజస్వి వ్యాఖ్యల వేళ.. భాజపా స్పందించింది. ఆయన్ను అవినీతిపరుడని కేంద్ర మంత్రి నిత్యానంద్‌రాయ్ అభివర్ణించారు. అవినీతికి పర్యాయపదంగా మారిన వ్యక్తి దాని గురించి మాట్లాడుతుంటే షాకింగ్‌గా ఉంది. అపారమైన సంపదను కూడబెట్టుకున్న ఈ కుటుంబం వల్ల బిహార్ వెనక్కి వెళ్లిపోయిందని వ్యాఖ్యలు చేశారు. యాదవ్ కుటుంబసభ్యులు పలు కేసులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ విమర్శలు చేశారు.దీనికిముందు బిహార్ ప్రజలనుద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలకు తమలో తాము ఎలా పోట్లాడాలో, స్వప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలో మాత్రమే తెలుసు. బిహార్‌ను ఆటవిక రాజ్యం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు, శాంతిభద్రతలను నెలకొల్పేందుకు సీఎం నీతీశ్‌కుమార్, ఎన్డీయే నేతలు ఎంతో కృషి చేశారని ధ్వజమెత్తారు.

# కర్నూలు బస్సు దుర్ఘటనపై చంద్రబాబు సీరియస్

అమరావతి,కర్నూలు బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో.. ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, అధికారులతో సమగ్ర విచారణకు ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల వివరాలు గుర్తించి కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో బస్సుల సాంకేతిక తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదికను కోరారు.అన్ని జిల్లాల్లో బస్సుల్లో సాంకేతిక తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖకు ఆదేశాలు జారీచేశారు. ప్రమాదానికి కారణం.. నిర్లక్ష్యమని తేలితే కఠిన చర్యలు తప్పవని ట్రావెల్స్ బస్సు యాజమాన్యానికి సీఎం హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యత, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం త్వరితగతిన అందిస్తామని మంత్రి



రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షిస్తున్నారని సీఎంకు తెలియజేశారు మంత్రి. అలాగే ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రజల భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# అప్పుల్లో తెలుగు రాష్ట్రాలే టాప్...



హైదరాబాద్,కేంద్ర గణాంక సంస్థ నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, తెలుగు రాష్ట్రాలు దేశవ్యాప్తంగా అప్పుల భారం విషయంలో అగ్రస్థానంలో నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో 43.7% మంది, తెలంగాణలో 37.2% మంది ప్రజలు అప్పులపై ఆధారపడి జీవిస్తున్నారని సర్వేలో తేలింది. 2020-21 గణాంకాల ప్రకారం, అప్పులపరంగా ఏపీ మొదటి స్థానంలో, తెలంగాణ రెండో స్థానంలో నిలిచాయి. మరోవైపు, బ్యాంకింగ్ సేవలు మరియు ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానమైన జనాభా శాతం (ఫైనాన్షియల్ ఇంక్లూజన్) విషయంలో కర్ణాటక (95.9%) మొదటి స్థానంలో ఉండగా, ఏపీ 92.3% శాతంతో రెండో స్థానంలో నిలిచింది. కానీ తెలంగాణలో ఈ శాతం కేవలం 86.5% మాత్రమే ఉండటంతో, దేశంలో 14వ స్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల సగటు చూస్తే, 92.1% మంది ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థలో భాగమై ఉండగా, వారిలో 31.8% మంది అప్పుల భారంతో బాధపడుతున్నారు. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో 80.2% మంది మాత్రమే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉండగా, 7.4% మందికే అప్పులున్నాయి.

సామాజిక వర్గాలు, కుటుంబ పరిమాణం ఆధారంగా అప్పుల భారంలో తేడాలు

సర్వేలోని గణాంకాల ప్రకారం, ఓబీసీ వర్గానికి చెందిన 16.6% మంది అప్పుల బారిన పడ్డారు. గిరిజన సమాజంలో ఈ శాతం 11% మాత్రమే ఉండటంతో కొంత తక్కువగా ఉంది. కుటుంబ పరిమాణం పరంగా కూడా ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి చిన్న కుటుంబాలపై అప్పుల ఒత్తిడి ఎక్కువగా ఉండగా, పెద్ద కుటుంబాల్లో ఆ భారం తక్కువగా ఉందని NSSO వివరించింది.అలాగే, మతపరంగా చూస్తే హిందువులలో 88.1%, ముస్లింలలో 80.8% మంది ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పరిధిలో ఉన్నారని గణాంకాలు వెల్లడించాయి. మొత్తంగా చూస్తే, ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ప్రజలు బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానమై ఉన్నా, అప్పుల భారంతో గణనీయంగా సతమతమవుతున్నారని ఈ నివేదిక స్పష్టం చేసింది.

## కావేరి బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు

హైదరాబాద్,కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటన అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదానికి గురైన బస్సుపై తెలంగాణలో 16 చలాన్లు ఉన్నాయి. రూ.23,120 ఫైన్లు పెండింగ్‌లో ఉన్నాయి. 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9 వరకు ఈ బస్సు 16 సార్లు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలిసింది. 9 సార్లు నో ఎంట్రీ జోన్‌లోకి ప్రవేశించడంతో జరిమానాలు పడ్డాయి. హైస్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ ఉల్లంఘనల పైనా చలాన్లు పడినట్లు తెలిసింది. ప్రమాదానికి గురైన బస్సు 9490 నంబరుతో రిజిస్టర్ అయినట్లు ఏపీ రవాణా శాఖ వెల్లడించింది. ఈ బస్సు ఫిట్‌గానే ఉందని, బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయని తెలిపింది. 'కావేరి ట్రావెల్స్ పేరిట రిజిస్ట్రేషన్ చేసి బస్సు నడుపుతున్నారు. 2018 మే 2న బస్సును డామన్ డయ్యూలో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ బస్సుకు 2030 ఏప్రిల్ 30 వరకు టూరిస్ట్ పర్మిట్ జారీ అయ్యింది. ప్రమాదానికి గురైన బస్సు ఫిట్‌గా ఉంది. 2027 మార్చి 31 వరకు ఫిట్‌నెస్ ఉంది. 2026 ఏప్రిల్ 20 వరకు బస్సుకు ఇన్సూరెన్స్ ఉంది. బైక్‌ను బలంగా ఢీకొట్టడం వల్లే బస్సులో మంటలు వచ్చాయి. అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. దర్యాప్తు నివేదిక మేరకు భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం అని రవాణా శాఖ పేర్కొంది.

# వీధికెక్కిన వివాదాలు.. కూటమి పార్టీల ఆధిపత్యపోరు




అమరావతి : కూటమి పార్టీల మధ్య ఆధిపత్యపోరు ఒక వైపు, స్వంత పార్టీ ప్రజాప్రతినిధుల మధ్యనే పొడచూపుతున్న విభేదాలు మరో వైపు టిడిపి అధిష్టానాన్ని తీవ్రంగా కలవరపెడుతున్నాయి. ఇవి చాలదన్నట్లు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్, టిడిపి నేత జెసి ప్రభాకర్‌రెడ్డి పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సభలో అనంతపురం జిల్లా అదనపు ఎస్‌పినుద్దేశించి ఎత్తుకున్న తిట్ల పురాణం పోలీస్‌శాఖకు, ప్రభుత్వానికి మధ్య అగాధం సృష్టించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వేర్వేరుగా విదేశీ పర్యటనలలో ఉన్న సమయంలో కూటమిలో, స్వపక్షంలో నెలకొన్న కీచులాటలు రాజకీయగా దుమారం రేపాయి. ఈ పరిణామాలు ప్రతిపక్షాలకు, ప్రధానంగా వైసిపికి అస్త్రాలుగా మారడంతో పరిస్థితులను ఏ విధంగా చక్కదిద్దాలన్నదానిపై టిడిపిలోని కీలక నేతలు తీవ్రంగా మదనపడుతున్నారు. విదేశాల్లో ఉన్న చంద్రబాబు, లోకేష్ అక్కడి నుండే ఈ వ్యవహారాలపై దృష్టి సారించారు.

తిరువూరు చిచ్చు

ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు టిడిపి ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావుకు, స్వంత పార్టీకే చెందిన విజయవాడ ఎంపి కేసినేని చిన్ని మధ్య కొంత కాలంగా నెలకొన్న అంతర్గత విభేదాలు గురువారం ఒక్కసారిగా రచ్చకెక్కి తీవ్రరూపం దాల్చాయి. ఎంఎల్ఎ టిక్కెట్ కోసం చిన్నికి తాను రూ.ఐదు కోట్లు ఇచ్చానంటూ బ్యాంక్ వివరాలతో సహా కొలికపూడి సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం సంచలనమైంది. మరిన్ని విషయాలు శుక్రవారం తెలుపుతానని ఆయన పేర్కొన్నారు. దానికి ఎంపి చిన్ని ఘాటుగా జవాబిచ్చారు. తిరువూరులో దొంగే .. 'దొంగ దొంగ' అని అరుస్తున్నారని, వైసిపి కోవర్టుగా మారారని ఆయన ఎంఎల్ఎపై విరుచుకుపడ్డారు. ఎంపి, ఎంఎల్ఎ మధ్య గొడవలను చక్కదిద్దేందుకు టిడిపి అధిష్టానం రంగంలోకి దిగింది. దుబాయ్ లో ఉన్న చంద్రబాబు అక్కడి నుండే ఈ వ్యవహారంపై స్పందించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఇరువురు నేతలను పిలిచి మాట్లాడతానని పల్లా శ్రీనివాస్ అనగా, అవసరం లేదని యుఎఇ నుండి వచ్చిన తరువాత తానే స్వయంగా దృష్టి సారిస్తానని బాబు చెప్పినట్లు సమాచారం. దీంతో శుక్రవారం ఆ ఇరువురు నేతలతో నిర్వహించ తలపెట్టిన సమావేశాన్ని పల్లా శ్రీనివాస్ రద్దు చేశారు. కొలికపూడి వ్యవహారశైలి గతంలో పలుమార్లు వివాదాస్పదమైంది. అప్పట్లో టిడిపి అధిష్టానం పరిస్థితిని చక్కబెట్టే చర్యలు చేపట్టినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు.

డిప్యూటీల కౌంటర్లు

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డిఎస్‌పి జయసూర్య జూదగృహాలు, ఇత్యాది అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నట్లు తనకు ఫిర్యాదులందాయని, దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ ఆ జిల్లా ఎస్‌పిని, రాష్ట్ర డిజిపిని ఆదేశించారు. దానిపై భీమవరం ప్రాంతానికే చెందిన ఉప సభాపతి, టిడిపి ఎంఎల్ఎ రఘురామ కృష్ణరాజు ప్రెస్ మీట్ పెట్టి మరీ సదరు డిఎస్‌పి మంచి అధికారని, ఆయనకు మంచి ట్రాక్ రికార్డు ఉందని పవన్‌కు కౌంటర్ ఇచ్చినంతపని చేశారు.

ఆరోపణలెదుర్కొంటున్న డిఎస్‌పికి డిప్యూటి స్పీకర్ ఎలా మద్దతిస్తారని జనసేన ఆగ్రహంతో ఊగిపోతోంది. రఘురామ ఆ డిఎస్‌పితో అసాంఘిక కార్యక్రమాల నిర్వహణకు పరోక్షంగా మద్దతిస్తున్నారని ఆరోపిస్తోంది. మొదటి నుంచీ జనసేన-టిడిపి మధ్య ఆధిపత్య కీచులాటలు తరచు బయట పడుతునే ఉన్నాయి. పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకర్గంలో టిడిపి మాజీ ఎంఎల్ఎ వర్మకు స్థానిక నాయకత్వానికి పడట్లేదు. ఈ మధ్యనే నాగబాబు ఎంఎల్‌సి అయ్యాక ఒక సభలో చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య ప్రకంపనలు రేపాయి. శాంతి భద్రతలపైనా, హోం మంత్రి అనితపైనా డిప్యూటి సిఎం హోదాలో పవన్ చేసిన వ్యాఖ్యలు సైతం టిడిపి, జనసేన కూటమిలో అసంతృప్తులకు కారణమయ్యాయి. ఇప్పుడు భీమవరం డిఎస్‌పి వ్యవహారంతో వ్యవహారం మరింత ముదిరింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com